
సాక్షి
కుమురం భీం

శనివారం, 24, జూన్, 2023



పర్యాటకులకు చేరువగా...
జన్నారం అటవీ డివిజన్‌లో నూతనంగా ఆరు కార్టేజీలు నిర్మిస్తున్నారు. అలాగే మరో మూడు సఫారీలు అందుబాటులోకి రానున్నాయి.
10లో▸



సమస్యలపై దృష్టి సారించండి
జైనూర్ మండల కేంద్రంలో శుక్రవారం సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. భగీరథ నీరందడం లేదని ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు.
11లో▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
29.7 /25.4
ఆకాశం చాలావరకు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు బాగా తగ్గుతాయి. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్థానికత ఆధారంగా బదిలీలు చేపట్టాలి



వినతిపత్రం చూపుతున్న ఉద్యోగులు

ఆసిఫాబాద్‌: స్థానికత ఆధారంగా తమను సొంత జిల్లాకు బదిలీ చేయాలని జీవో 317తో స్థానికత కోల్పోయిన కుమురంభీం జిల్లాకు చెందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ వద్ద శుక్రవారం వారు మాట్లాడారు. జీవో 317 కారణంగా స్థానిక ఉద్యోగులు, ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. శాశ్వతంగా స్థానికతను కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని, తమ పిల్లలు కూడా స్థానికత కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే జిల్లాలోని నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరారు. మండలంలోని అప్పపెల్లిలో చాహత్‌ బాజ్‌పాయ్‌ని కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పృథ్విరాజ్‌, జి.శ్రీనివాస్‌తో పాటు పలువురు ఉద్యోగులు ఉన్నారు.

రేపు సీఆర్టీల ఎంపిక పరీక్ష

ఆసిఫాబాద్‌: జిల్లా కేంద్రంలో ఆదివారం ఉదయం 9.30 గంటలకు గిరిజన సంక్షేమ శాఖలో కాంట్రాక్టు ఉపాధ్యాయుల ఎంపిక పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మణెమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని పీటీజీ బాలురు, కోర్టు సమీపంలోని బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాల, బాలుర ఆశ్రమ పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. అభ్యర్థులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

'డిఫెన్స్‌ కౌన్సిల్‌ సిస్టం' ప్రారంభం



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న జిల్లా జడ్జి రమేశ్‌

ఆసిఫాబాద్‌: జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేసిన లీగల్‌ ఎయిడ్‌ డిఫెన్స్‌ కౌన్సిల్‌ సిస్టంను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్‌ భుయాన్‌ శుక్రవారం వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్‌ ఎంవీ రమేశ్‌ జిల్లా కేంద్రంలో కార్యాలయం, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఫెన్స్‌ కౌన్సిల్‌ సిస్టం ప్రాధాన్యతను వివరించారు. అసిస్టెంట్‌ లీగల్‌ ఎయిడ్‌ డిఫెన్స్‌ కౌన్సిల్‌గా నియమితురాలైన అంజనాదేవి మాట్లాడుతూ ఈ కేంద్రం ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్‌ సివిల్‌ జడ్జి యువరాజ్‌, జూనియర్‌ సివిల్‌ జడ్జి ఉమామహేశ్వరి, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో 'బలిదాన్‌ దివస్‌'



శ్యామప్రసాద్‌ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్‌: కాగజ్‌నగర్‌ పట్టణంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్‌, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాల్వాయి హరీశ్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం వేర్వేరుగా బలిదాన్‌ దివస్‌ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామప్రసాద్‌ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్‌ అద్దె గదుల వేలం

కాగజ్‌నగర్‌టౌన్‌: కాగజ్‌నగర్‌ మున్సిపల్‌ కార్యాలయ ఆవరణలో నిర్మించిన తొమ్మిది అద్దె గదులకు మున్సిపల్‌ కమిషనర్‌ అంజయ్య ఆధ్వర్యంలో శుక్రవారం వేలం నిర్వహించారు. తొమ్మిది గదులుండగా.. ఎస్టీకి కేటాయించిన రెండో నంబర్‌ గదికి ఎలాంటి దరఖాస్తులు రాలేదు. మిగిలిన ఎనిమిది గదులకు 20 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ వేలం ద్వారా నెలకు రూ.31,350 అద్దె ఆదాయం వస్తుందని కమిషనర్‌ తెలిపారు. వేలంలో గదులు రాని వారు మున్సిపల్‌ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే, రూ.25 వేలను తిరిగి ఇవ్వనున్నట్లు వివరించారు.

నిబంధనలకు నీళ్లు!



ఈ చిత్రంలో కనిపిస్తుంది శ్రీచశ్వి వైన్స్‌. కాగజ్‌నగర్‌ సర్కిల్‌ పరిధిలోని దహెగాం మండల కేంద్రంలో ఉన్న ఈ షాపులో కల్తీ మద్యం విక్రయిస్తుండగా సోమవారం హైదరాబాద్‌ టాస్క్‌ఫోర్స్‌ బృందం సభ్యులు పట్టుకున్నారు. మద్యం షాపును అధికారులు సీజ్‌ చేశారు.

- మద్యం దుకాణాల్లోనే కల్తీ అమ్మకాలు
- బీరు సీసాలపై అధిక ధర వసూలు
- సమయ పాలనలోనూ ఇష్టారాజ్యం
- మొక్కుబడిగా ఎక్సైజ్‌ శాఖ తనిఖీలు

సాక్షి, ఆసిఫాబాద్‌: జిల్లాలో మద్యం దుకాణాల యజమానులు నిబంధనలను కాలరాస్తున్నారు. ఓ వైపు కల్తీ, మరోవైపు అధిక ధరలతో జేబులు నింపుకుంటున్నారు. హైదరాబాద్‌ టాస్క్‌ఫోర్స్‌ తనిఖీల్లో అక్రమాలు బయట పడుతుండటంతో స్థానిక అబ్కారీ సిబ్బంది పనితీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బడి, గుడి గంట మొదలే దుకాణాలు తెరుచుకుంటున్నాయి. సంబంధిత శాఖ అధికారులు మాత్రం నామమాత్రపు తనిఖీలతో మద్యం వ్యాపారులకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు ఓసారి కఠినంగా, మరోసారి చూసీచూడనట్టుగా పోలీసుల తనిఖీలు ఉంటున్నాయి.. వెరసి జిల్లాలో మద్యం వ్యాపారం హద్దులు లేకుండా సాగుతోంది.

మైనర్లకూ మద్యం అమ్మకాలు..
21 సంవత్సరాల్లోపు వారికి మద్యం అమ్మకూడదనే నిబంధన ఉన్నప్పటికీ మద్యం వ్యాపారులు దానిని బేఖాతరు చేస్తున్నారు. ఉదయం లేవగానే ప్రజలకు మద్యం అందుబాటులో ఉంచాలనుకుంటున్నారో ఏమో పది గంటల్లోపే దుకాణాలు తెరిచి పసిపిల్లవాడు వెళ్లినా మద్యం ఇచ్చేస్తున్నారు. 'అదేంటి అలా ఇవ్వకూడదు కదా?' అని ఎవరైనా ప్రశ్నిస్తే.. 'మరి.. మా మద్యం అమ్మకాలు జరిగేదెలా?' అని ఎదురు ప్రశ్న వేస్తుండటం గమనార్హం. జిల్లాలో ఎక్కడ చూసినా ఇలా మైనర్‌ విద్యార్థులు, బాలలు మద్యం దుకాణాలకు వెళ్లి మద్యం కొనుగోలు చేసే దృశ్యాలు సాధారణంగా కనిపిస్తున్నాయి. 2016లో కాగజ్‌నగర్‌లోని జవహర్‌ నవోదయ విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు కాగజ్‌నగర్‌ పట్టణంలోని పెట్రోల్‌పంపు ఏరియాలోని లైసెన్సు మద్యం దుకాణం నుంచి నాలుగు బీర్లు కొనుగోలు చేసి విద్యాలయంలోనే తాగారు. ఈ విషయం తెలిసిన ప్రిన్సిపాల్‌ ఆ విద్యార్థులను మందలించగా తీవ్ర మనస్తాపానికి గురైన ఓ విద్యార్థి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పట్లో ఈ విషయం పట్టణంలో సంచలనం సృష్టించింది. అయితే సదరు మద్యం దుకాణం యజమాని నిబంధనలు పాటించి ఉంటే ఆ ఘటన జరిగి ఉండేది కాదని స్థానికులు, విద్యాలయ అధ్యాపకులు గుర్తు చేసుకుంటున్నారు.

కొరవడిన పర్యవేక్షణ..
జిల్లాలో మద్యం దుకాణాలపై సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రంగానే కనిపిస్తోంది. వైన్స్‌ల్లో కల్తీ మద్యం విక్రయిస్తున్నారని ఫిర్యాదులు వచ్చినా సిబ్బంది స్పందించడం లేదు. చౌక మద్యం ఎక్కువ ధర మద్యంలో కలుపుతూ అమ్ముతున్నారని తెలుస్తోంది. మరోవైపు దుకాణాల్లోనే విడి అమ్మకాలు బాహాటంగానే జరుగుతున్నాయి. విడి అమ్మకాలతోనే మద్యం కల్తీకి మార్గం సుగమవుతున్నట్లు తెలుస్తోంది. అయితే వీటిపై ఫిర్యాదులు వెళ్తే ఎక్సైజ్‌ సిబ్బంది పట్టించుకోవడం లేదు. ఇటీవల జిల్లాలో వెలుగు చూసిన కల్తీ కేసు హైదరాబాద్‌ నుంచి వచ్చిన ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ బృందం తనిఖీల్లో వెలుగులోకి వచ్చిందే తప్ప జిల్లాలో అబ్కారీ సిబ్బంది మాత్రం దుకాణాల జోలికి కూడా వెళ్లడం లేదు. విసిగిపోతున్న ప్రజలు నేరుగా టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేస్తున్నారు.

అధిక ధరకు విక్రయాలు
మద్యం దుకాణంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే విక్రయించాలనే నిబంధనలు ఉన్నా జిల్లాలో ఏ మద్యం దుకాణంలోనూ పాటించడం లేదు. బీరు సీసాలపై రూ.10 అధికంగా తీసుకుంటున్నారు. దుకాణాల యజమానులు ధర విషయంలో కూటమిగా మారుతున్నారు. అబ్కారీ అధికారులకు మాత్రం ఇటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడంపై అనేక అరోపణలు వినిపిస్తున్నాయి.

నామమాత్రపు తనిఖీలు
మద్యం దుకాణాల్లో విచ్చలవిడిగా అక్రమాలు జరుగుతున్నా అధికారులు మాత్రం నామమాత్రపు తని ఖీలతో మామూలుగా వ్యవహరిస్తున్న తీరు అనుమానాలకు తావిస్తోంది. దుకాణాలపై అసలే నియంత్రణ లేదని తెలుస్తోంది. ఫిర్యాదులు వెళ్లినా పట్టించుకోకపోవడం వెనుక మద్యం వ్యాపారులు ఇస్తున్న మామూళ్లే కారణమన్న ఆరోపణలు ఉన్నాయి. దుకాణాల్లో కౌంటర్లపైనే విడి అమ్మకాలు సాగిస్తు న్నా.. రశీదులు ఇవ్వకున్నా.. అధిక ధరలకువిక్రయిస్తున్నా.. పట్టించుకునే వారు కరువయ్యారు.

తనిఖీలు చేపడుతున్నాం
కల్తీ మద్యం, అధిక ధరలపై తరచూ తనిఖీలు చేపడుతున్నాం. స్థానిక ఎక్సైజ్‌ స్టేషన్‌ అధికారులు కా కుండా ఇతర మండల ఎక్సైజ్‌ సిబ్బంది ఈ తనిఖీ ల్లో పాల్గొంటుంటారు. దహెగాం మండలంలోని వైన్స్‌లో మద్యం సీసాల్లో నీళ్లు కలిపి విక్రయిస్తున్నట్లు తెలిసింది. దుకాణాల్లో అధిక ధరలకు అమ్ముతున్నారని తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం.
– జ్యోతి కిరణ్‌, జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారి

బడులకు ట్యాబ్‌లు



ట్యాబ్‌ అందజేస్తున్న అధికారులు

- విడతల వారీగా పంపిణీ చేయనున్న రాష్ట్ర ప్రభుత్వం
- జిల్లాలో 575 పాఠశాలలకు అందజేత
- ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో సమాచారం నిక్షిప్తం

కెరమెరి(ఆసిఫాబాద్‌): నూతన టెక్నాలజీని వినియోగించి విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇప్పటికే ఎంపిక చేసిన ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో డిజిటల్‌ తరగతులు ప్రారంభించారు. తాజాగా విద్యాశాఖ అధికారులు ప్రధానోపాధ్యాయులకు ట్యాబ్‌లు అందజేస్తున్నారు. అంగన్‌వాడీ టీచర్లకు గతంలోనే ట్యాబ్‌లు అందించగా.. వారు అన్ని కార్యక్రమాలు వాటి సాయంతోనే చేపడుతున్నారు. హెడ్‌ మాస్టర్లు కూడా విద్యార్థులు, పాఠశాలల వివరాలను ఇక నుంచి ఆన్‌లైన్‌లోనే ట్యాబ్‌ల ద్వారానే నిక్షిప్తం చేయాల్సి ఉంటుంది.

ఆన్‌లైన్‌లో పూర్తి వివరాలు
విద్యాశాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పలు కార్యక్రమాలు, వాటి పురోగతి వివరాలను గతంలో ఉపాధ్యాయులు ఎమ్మార్సీ కార్యాలయంలో సీఆర్‌పీల సాయంలో ఆన్‌లైన్‌లో నమోదు చేసేవారు. ప్రస్తుతం ప్రధానోపాధ్యాయులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తుండటంతో ఎంఈవో కార్యాలయ సిబ్బంది, సీఆర్‌పీలపై కొంత భారం తగ్గనుంది. ట్యాబ్‌ల ద్వారా పాఠశాలకు సంబంధించి పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాల్సి ఉంటుంది. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం వివరాలతో పాటు చైల్డ్‌ ఇన్ఫోలో విద్యాసామర్థ్యాల పురోగతి, పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులు, ఏకరూప దుస్తులు, పుస్తకాల పంపిణీ, రవాణా భత్యం, యూడైస్‌ వివరాలు.. ఇలా ప్రతీ అంశానికి సంబంధించిన వివరాలను రోజువారీగా అప్‌డేట్‌ చేయాల్సి ఉంటుంది.

విద్యార్థుల సమగ్ర సమాచారం..
పాఠశాలల చేరుతున్న విద్యార్థి వివరాలను రెండు రకాలుగా విభజించి నమోదు చేయనున్నారు. వ్యక్తిగత సమాచారం కింద విద్యార్థి, తల్లిదండ్రుల పేరు, పాఠశాలలో ప్రవేశ సంఖ్య, తరగతి, ఏ సంవత్సరంలో చేరాడు.. పుట్టిన తేదీ, ఆధార్‌కార్డు నంబర్‌, పుట్టుమచ్చలు, పొదుపు ఖాతా బ్యాంకు నంబర్‌, తల్లిదండ్రుల ఫోన్‌ నంబర్‌ సేకరిస్తారు. ఇక విద్యాపరమైన వివరాల కింద మార్కులు, సహ పాఠ్య ప్రణాళికలో ప్రతిభ, సబ్జెక్టుల వారీగా బలాలు, బలహీనతలు, ఆరోగ్య వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.

575 పాఠశాలలకు..
జిల్లాలోని అన్ని పాఠశాలలకు విడతల వారీగా ట్యాబ్‌లు పంపిణీ చేయనున్నారు. విద్యార్థుల సంఖ్యను బట్టి కొన్ని పాఠశాలలకు రెండు చొప్పున అందిస్తామని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. జిల్లాలో మొత్తం 738 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. తొలి విడతలో 575 పాఠశాలలకు మొత్తం 583 ట్యాబ్‌లు కేటాయించారు. ఇందులో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న పాఠశాలలకు రెండు చొప్పున అందించారు. ఆసిఫాబాద్‌ మండలంలోని ఎంపీయూపీఎస్‌ తేజిగూడ, చిర్రకుంట, గుండి, చింతలమానెపల్లి మండలంలోని యూపీఎస్‌ కర్జవెల్లి, దహెగాం మండలంలోని యూపీఎస్‌ ఐనం, జైనూర్‌ మండలంలోని జైనూర్‌ (ఉర్దు), కాగజ్‌నగర్‌లో యూపీఎస్‌ బోదెపల్లి, కాగజ్‌నగర్‌ వార్డు నంబర్‌ 14, కెరమెరి మండలంలోని ఎంపీపీఎస్‌ కెరమెరి (టీ/ఎం), లింగాపూర్‌ మండలంలోని పీపీపీఎస్‌ లింగాపూనూర్‌, రెబ్బెన మండలంలోని ఎంపీయూపీఎస్‌ వంకులం, వాంకిడి మండలంలోని ఎంపీయూపీఎస్‌ కనగాం, ఖమానా పాఠశాలల్లో రెండేసి ట్యాబ్‌లు పంపిణీ చేశారు. వాటిలో సాంకేతిక సమస్యలు తలెత్తినా తక్షణమే మరమ్మతులు చేసే విధంగా బాధ్యతలను జిల్లా వ్యాప్తంగా ఒకే ఏజెన్సీకి అప్పగించారు.

ఆన్‌లైన్‌లో వివరాలు
పాఠశాల విద్యార్థులకు సంబంధించిన అన్ని వివరాలు ఇక నుంచి ట్యాబ్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ప్రధానోపాధ్యాయులు ఆన్‌లైన్‌లో వివరాలు ఉండేలా చర్యలు తీసుకోవాలి. మెయింటనెన్స్‌ ఖర్చులు పాఠశాల గ్రాంటు నుంచి వినియోగించుకోవాలి.
– అశోక్‌, జిల్లా విద్యాధికారి

అనాథలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు, చిన్నారులు

ఆసిఫాబాద్‌: ఎనిమిదేళ్ల క్రితం సీఎం కేసీఆర్‌ అనాథ పిల్లలకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని మహాజన సంఘర్షన సమితి జిల్లా నాయకులు రేగుంట కేశవరావు మాదిగ డిమాండ్‌ చేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ ఎదుట అనాథ పిల్లలతో కలిసి 'అనాథ అరిగోస' పేరిట దీక్ష చేపట్టారు. అనంతరం అదనపు కలెక్టర్‌ చాహత్‌ బాజ్‌పాయ్‌కి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రేగుంట కేశవరావు మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌ 2015 జూన్‌ 23న అసెంబ్లీ సాక్షిగా అనాథలకు హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. ఎనిమిదేళ్లు గడుస్తున్నా హామీలు నెరవేర్చలేదన్నారు. మంత్రివర్గ ఉప సంఘం అనాథల కోసం చేసిన 40 సిఫార్సులు అమలు చేయకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. వారికి విద్య, ఉద్యోగాల్లో ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించి, కేజీ టు పీజీ వరకు ఇంటిగ్రేటెడ్‌ క్యాంపస్‌లు ఏర్పాటు చేయాలని డిమాండ్‌ చేశారు. ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయడంతోపాటు ఏటా బడ్జెట్‌లో అనాథల అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో వేదం సునీత, అఖిల, అంజలి, మానస, ప్రణీత, సాత్విక హరి, పావని, గోదారి, రాఘవ, వినోద్‌, కుమ్రం మహేశ్‌, ఉంగరం అశ్విని పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్‌ నాయకులు బ్రహ్మయ్య, సత్యనారాయణ, మహేశ్‌, సాగర్‌, తిరుపతి, సందీప్‌ దీక్ష శిబిరం వద్ద సంఘీభావం ప్రకటించారు.

మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌ చాహత్‌ బాజ్‌పాయ్‌

- అదనపు కలెక్టర్‌ చాహత్‌ బాజ్‌పాయ్‌

ఆసిఫాబాద్‌: మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్‌ చాహత్‌ బాజ్‌పాయ్‌ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 26న మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లాలోని కళాశాలలు, విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలను వివరించాలని, జిల్లా కేంద్రంలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించాలన్నారు. అలాగే విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించాలన్నారు. మారుమూల గ్రామాల్లో మైనర్లు పొగాకు ఉత్పత్తులకు అలవాటు పడకుండా అవగాహన కల్పించాలన్నారు. అవగాహన ర్యాలీలో జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొనాలని సూచించారు. సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మణెమ్మ, జిల్లా సంక్షేమ అధికారి సావిత్రి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు, ఎస్సీ కార్పొరేషన్‌ అధికారి సజీవన్‌ పాల్గొన్నారు.

విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలి



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్‌ చాహత్‌ బాజ్‌పాయ్‌

ఆసిఫాబాద్‌: ఆధునిక సాంకేతికతతో విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలని అదనపు కలెక్టర్‌ చాహత్‌ బాజ్‌పాయ్‌ అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో మంజూరైన ట్యాబ్‌లను డీఈవో అశోక్‌తో కలిసి శుక్రవారం అందజేశారు. సాంకేతికతను ఉపాధ్యాయులు సమయ స్ఫూర్తితో వాడుకోవాలన్నారు. డీఈవో అశోక్‌ మాట్లాడుతూ జిల్లాకు 583 ట్యాబ్‌లు కేటాయించినట్లు తెలిపారు. ప్రతీ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు ఎం.భరత్‌, అసిస్టెంట్‌ స్టాటిస్టికల్‌ కోఆర్డినేటర్‌ అబిద్‌ అలీ, ఎంఈవోలు సోమయ్య, రమేశ్‌బాబు, భిక్షపతి, వెంకటేశ్వర్లు, మనుకుమార్‌, హెచ్‌ఎంలు సుభాశ్‌, ప్రకాశ్‌, శ్రీనివాస్‌, సత్యనారాయణ, రమేశ్‌, రాము, భరత్‌, హన్మంతు, భానుప్రకాశ్‌ పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధికి చర్యలు
ఆసిఫాబాద్‌: జిల్లాలో విద్యారంగ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్‌ చాహత్‌ బాజ్‌పాయ్‌ అన్నారు. ఆసిఫాబాద్‌ మండలం రౌటసంకెపల్లిలోని శాటిలైట్‌ సెంటర్‌ పాఠశాలను శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు కంప్యూటర్‌పై ప్రాథమిక అవగాహన కల్పించారు. అదనపు కలెక్టర్‌ మాట్లాడుతూ విద్యాశాఖ, అనుబంధ శాఖల సమన్వయంతో మారుమూల ప్రాంతాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అనంతరం మెంగుబాయిగూడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలించారు. అనంతనం జన్కాపూర్‌ జెడ్పీ హైస్కూల్‌లో చేపట్టిన మన ఊరు– మన బడి కార్యక్రమం పనులు పరిశీలించారు. పెండింగ్‌ పనులు త్వరగా పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఆశ్రమ బాలికల పాఠశాలను కొనసాగించాలి

ఆసిఫాబాద్‌: జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా గిరిజన సంక్షేమాధికారి మణెమ్మకు వినతిపత్రం అందించారు. విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలో సుమారు 800 మంది విద్యనభ్యసిస్తుండగా, స్పోర్ట్స్‌ స్కూల్‌ ఏర్పాటుతో విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తోందన్నారు. పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని కోరారు. డీవైఎఫ్‌ఐ, కేవీపీఎస్‌ నాయకులు గొడిసెల కార్తీక్‌, దుర్గం దినకర్‌, దుర్గం నిఖిల్‌ ఉన్నారు.

'బీజేపీ పాలనలో దేశాభివృద్ధి'



పోస్టర్లు అందజేస్తున్న నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్‌): బీజేపీ ప్రభుత్వ తొమ్మిదేళ్ల పాలనలో ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని ఎంతో అభివృద్ధి చేశారని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అజ్మీర ఆత్మారాం నాయక్‌, కృష్ణకుమారి అన్నారు. గోలేటిలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం దుకాణదారులకు పోస్టర్లు అందించారు. వారు మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం ప్రపంచానికి కరోనా టీకాలు అందించే స్థాయికి ఎదిగిందన్నారు. జాతీయ రహదారుల నిర్మాణంతో రోడ్డు వ్యవస్థ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామాలు అభివృద్ధి బాట పట్టాయన్నారు. కేంద్ర ప్రభుత్వ పనితీరును ప్రజలకు తెలియజేస్తూ ప్రజలను చైతన్యం చేయడమే 'ఇంటింటికీ బీజేపీ' కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో నీళ్లు, నిధులు, నియామకాలు కేవలం కల్వకుంట్ల కుటుంబానికే దక్కాయని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్‌, నాయకులు మల్లిక్‌, బత్తిని రమేశ్‌, వినయ్‌, ప్రకాశ్‌ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రికార్డులు తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎల్ఈవో

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని ఎస్ అండ్ పీసీ కార్యాలయాన్ని శుక్రవారం లేబర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ (ఎల్ఈవో) శంకర్‌రావు పరిశీలించారు. ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ నగునూరి రవిని అడిగి వారి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సీనియర్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ సుంకరి రమేష్, జూనియర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, జమేదార్ నారాయణ, ఆఫీస్ సిబ్బంది ఎల్ఈవోను ఘనంగా సన్మానించారు.

ఒకరిపై అట్రాసిటీ కేసు నమోదు

జన్నారం: కులం పేరుతో దూషించిన ఒకరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. శుక్రవారం ఆయన వివరాల ప్రకారం... ఈ నెల 8న జన్నారం మండలం కలమడుగు గ్రామానికి చెందిన శ్రీపెల్లి లక్ష్మణ్‌ను అదే గ్రామానికి చెందిన రుక్మి ప్రసాద్ కులం పేరుతో దూషిస్తూ దాడికి పాల్పడినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం ప్రసాద్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అదే విధంగా ప్రసాద్‌పై దాడి చేసినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

జైపూర్: పల్లెల్లో నిరంతరం పారిశుధ్య పనులు చేపట్టాలని, రోడ్లు ఎప్పటికప్పుడూ శుభ్రం చేస్తూ ఎక్కడా చెత్తా, ప్లాస్టిక్ లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి డి.వెంకటేశ్వర్‌రావు తెలిపారు. మండలంలోని ముదిగుంట, మిట్టపల్లి, కాన్కూర్ గ్రామ పంచాయతీలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోడ్లు, మురికాలవలు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో రికార్డులు పరిశీలించారు. ఎంపీవో అనిల్‌కుమార్, సర్పంచ్‌లు దుగుట జ్యోతి, వెంకటేశ్వర్‌గౌడ్, కుంటాల సౌజన్య, కార్యదర్శులు సురేశ్, సురేందర్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు డ్రోన్ పిచికారీపై అవగాహన సదస్సు

బెల్లంపల్లి: బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో శనివారం డ్రోన్‌ల ద్వారా పురుగుల మందు పిచికారీపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎం.రాజేశ్వర్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. కేవీకే ప్రాంగణంలో ఉదయం 11 గంటలకు అవగాహన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. డ్రోన్‌ల ద్వారా ఏ తీరుగా పురుగుల మందు పిచికారీ చేయవచ్చో వివరిస్తామని, ఆసక్తి కలిగిన రైతులు హాజరు కావాలని కోరారు.

గీత కార్మికుడికి గాయాలు

దహెగాం: మండలంలోని హత్తిని గ్రామానికి చెందిన గీత కార్మికుడు ముక్కెర రాజా గౌడ్ తాటి చెట్టుపై నుంచి పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. శుక్రవారం సాయంత్రం రాజాగౌడ్ పాత హత్తినిలోని తాటి చెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు మంచిర్యాలలోని ఆస్పత్రికి తరలించారు.

పర్యాటకులకు చేరువగా...

- మూడు సఫారీలు – ఆరు కార్టేజీలు
- పర్యాటక రంగం అభివృద్ధిపై అటవీశాఖ దృష్టి
- జన్నారం రానున్న కొత్త సఫారీలు
- కార్టేజీ పనులు ప్రారంభం

జన్నారం: అటవీశాఖ పర్యాటక రంగ అభివృద్ధిపై దృష్టి సారించింది. రోజురోజుకూ జన్నారంకు పర్యటకుల సంఖ్య పెరుగుతుండడంతో పర్యటకులకు సౌకర్యం కల్పించేందుకు అటవీశాఖ ముందడుగు వేసింది. ఇందులో భాగంగా జన్నారం అటవి డివిజన్‌లో నూతనంగా ఆరు కార్టేజీల నిర్మాణం కోసం పనులు ప్రారంభించింది. అదే విధంగా మరో మూడు సఫారీలు తీసుకురానుంది.

రూ.50లక్షలతో కార్టేజీల పనులు ప్రారంభం

జన్నారం మండలంలో ఇదివరకే పర్యాటకశాఖ ఆధ్వర్యంలో పర్యటకుల కోసం 11 కార్టేజీల నిర్మాణం చేసి రెండు సఫారీలు ఏర్పాటు చేశారు. పర్యాటకుల సంఖ్య పెరగడంతో గదుల కోసం, సఫారీ ప్రయాణం కోసం పోటీ పెరిగింది. ఈ క్రమంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పర్యాటకులకు సౌకర్యాలు కల్పించాలని యోచించింది. ఈ క్రమంలో ఎఫ్‌డీవో మాధవరావు ఈ విషయం పీసీసీఎఫ్ డోబ్రీయాల్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఇందుకు అంగీకరించినట్లు అధికారులు తెలిపారు. దీంతో జన్నారం మండలం పోలీస్‌స్టేషన్ సమీపంలోని పాడైనా క్వార్టర్లను కూల్చి నూతనంగా కార్టేజీల నిర్మాణానికి పనులు ప్రారంభించారు. ఇందుకు రూ.50లక్షల వరకు వెచ్చిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు.



నూతనంగా నిర్మించనున్న కార్టేజీల కోసం కేటాయించిన స్థలం

కార్టేజీలతో పాటు...

అటవీశాఖ స్థలంలో కార్టేజీలతో పాటుగా మరికొన్ని సౌకర్యాలు కల్పించేందుకు అటవీశాఖ అధికారులు యోచిస్తున్నారు. ముందుగా ఆరు కార్టేజీలు, ఒక డైనింగ్ హాలు, రిసెప్షనిస్టు గది, షాపింగ్‌మాల్ కూడా ఏర్పాటు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. చిన్నారులను ఆకట్టుకునే విధంగా, పెద్దలు ఆహ్లాదం పొందేలా తగు ఏర్పాట్లు చేయడానికి ప్రతిపాదనలు తయారు చేశారు.

పెరిగిన రెండు ట్రాక్‌లు

ఇప్పటి వరకు పర్యాటకులు అడవిలో పర్యటించేందుకు ఒక ట్రాక్ మాత్రమే ఉంది. డివిజన్‌లోని గేట్ నంబర్ 1 నుంచి బైసన్‌కుంట, గొండుగూడ బేస్‌క్యాంప్, నీలుగాయికుంట ప్రాంతాల్లో 15కిలోమీటర్ల దూరంలో జంగిల్ సఫారీల ద్వారా ప్రయాణం చేస్తారు. కానీ వచ్చే అక్టోబర్ మాసం నుంచి పర్యటకుల కోసం మరో రెండు ట్రాక్‌లు పెంచుతున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. చింతగూడ అటవీ ప్రాంతం నుంచి తాళ్లపేట్ వరకూ ఒక ట్రాక్, ఇందన్‌పల్లి రేంజ్‌లోని గేట్ నంబర్ 5 నుంచి మైసమ్మకుంట, ఘనిషెట్టికుంట, కల్పకుంట వరకూ మరో ట్రాక్ ఏర్పాటు చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

మరో మూడు సఫారీలు...

పర్యటకుల సంఖ్య పెరుగుతుండడంతో సఫారీల కోసం పర్యటకులు ఎదురు చూడకుండా అటవీశాఖ ఆధ్వర్యంలో కొత్తగా సఫారీలు ఏర్పాటు చేస్తున్నారు. ఇదివరకే పర్యటకశాఖ నుంచి రెండు జంగిల్ సఫారీలు, అటవీశాఖ నుంచి రెండు జంగిల్ సఫారీలున్నాయి. వీటితో పాటుగా మరో మూడు పెద్ద సఫారీలు తీసుకురానున్నారు. నిర్మల్‌లో మొత్తం ఐదు సఫారీలను అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రారంభించగా అందులో మూడు సఫారీలు ఇక్కడికి తీసుకువస్తున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. కొత్తగా తీసుకువచ్చే సఫారీల కెపాసిటీ పెద్దగా ఉండడమే కాకుండా పైనా కప్పు ఉంది. వర్షం వచ్చిన ఇబ్బంది లేకుండా ఉంటుంది.

అక్టోబర్ వరకు పూర్తి

పర్యాటకుల సంఖ్య పెరగడంతో అటవీశాఖ నుంచి పర్యటక రంగ అభివృద్ధి కోసం నూతనంగా కార్టేజీలు నిర్మించాలనే నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఈసీ ఎదురుగా గల అటవీశాఖ స్థలంలో రూ.50లక్షలతో కార్టేజీల నిర్మాణం చేపడుతాం. అక్కడే సౌకర్యాలు ఏర్పాటు చేస్తాం. అదే విధంగా జంగిల్ సఫారీల సంఖ్య కూడా పెంచుతున్నాం. ట్రాక్‌లు పెంచుతున్నాం. దీంతో పర్యాటకులు ఆహ్లాదం పొందుతారు.

– సిరిపురం మాధవరావు, డెప్యూటి కన్జర్వేటర్

రక్షణ బాధ్యతగా భావించాలి



మాట్లాడుతున్న సేఫ్టీ జీఎం గుప్తా

శ్రీరాంపూర్: ప్రతీ ఉద్యోగి గనుల్లో రక్షణ చర్యలను బాధ్యతగా భావించాలని బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ సీఎం కేహెచ్ఎన్ గుప్తా తెలిపారు. శుక్రవారం ఎస్ఆర్పీ 3, 3ఏ గనిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా రక్షణ నా బాధ్యత అనే నినాదంతో ప్రతీ ఉద్యోగి పని చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ రక్షణ సూత్రాలను పాటించి పనిచేయాలన్నారు. ఇంటా, బయట ఎక్కడికి వెళ్లినా కూడా మన ప్రాణాలను రక్షించుకుంటూ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏరియా సేఫ్టీ అధికారి శ్రీధర్‌రావు, ఏజెంట్ గోపాల్ సింగ్ మేనేజర్ సంతోష్ కుమార్, సిమ్‌టార్ సెంటర్ ఇన్‌చార్జి జి.విజయ్‌కుమార్, అడిషనల్ మేనేజర్ శ్రీధర్‌రావు, సేఫ్టీ అధికారి మహేందర్, సెక్రెటరీ గోపాల్ ఉన్నారు.

నేటి నుంచి ఇంటర్ మూల్యాంకనం

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన స్పాట్‌వాల్యూయేషన్ ఈ నెల 24 నుంచి ప్రారంభమవుతాయని డీఐఈవో శైలజ తెలిపారు. ఫిజిక్స్, ఎకానమిక్స్, బోటనీ, జువాలజీ సబ్జెక్టుల సంబంధించిన అధ్యాపకులు కళాశాలలో రిలీవ్ అయి ఆర్డర్‌కాపీతో హాజరుకావాలని పేర్కొన్నారు. ఉదయం 10గంటలకు రిపోర్టు చేయని ఎగ్జామినర్‌కు జరిమానా విధిస్తామని తెలిపారు.

పర్యావరణాన్ని కాపాడాలి

- జీఎం సంజీవరెడ్డి
- డిస్పెన్సరీలో స్వచ్ఛతా పక్వాడా

శ్రీరాంపూర్: పర్యావరణాన్ని కాపాడాలని శ్రీరాంపూర్ జీఎం బీ సంజీవరెడ్డి తెలిపారు. శుక్రవారం నస్పూర్ కాలనీలోని సింగరేణి డిస్పెన్సర్ లో స్వచ్ఛతా పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం అధికారులతో కలిసి చీపురు పట్టి చెత్తాచెదారం శుభ్రం చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి తాను పనిచేసే చోట పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చాలా వ్యాధులకు అపరిశుభ్ర వాతావరణమే కారణమన్నారు. ఈ నెల 16 నుంచి 30వరకు గనుల్లో స్వచ్ఛతా పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల పర్యావరణంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన ఉద్యోగులకు జీఎం చేతుల మీదుగా బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రమేష్ బాబు, డీజీఎం పర్సనల్ అరవింద్‌రావు మెడికల్ సూపరిండెంట్లు మురళీధర్ లోక్నాథ్ రెడ్డి సెక్రటరీ ఎం రమేష్ తదితరులు పాల్గొన్నారు.



చెత్తను శుభ్రం చేస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్ ఓసీపీలో...

శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిలో స్వచ్ఛతా పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలరీ మేనేజర్ సుధీర్ పాల్గొని పరిసరాల పరిశుభ్రతపై తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఇంజినీర్ చంద్రశేఖర్, రక్షణ అధికారి శ్రీనివాస్, అధికారుల సంఘం ప్రతినిధి శ్యాంసుందర్, సంక్షేమ అధికారి శంకర్, ఫిట్ సెక్రెటరీ కందుల శంకరయ్య పాల్గొన్నారు.

డెప్యూటీ సీఎల్సీకి వినతి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ శ్రీనివాసులను కలిసి వినతిపత్రం శుక్రవారం అందజేశారు. హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ అంతోటి నాగేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీ కనుకుల తిరుపతి కలిశారు. సింగరేణి గుర్తింపు సంఘం కాల పరిమితి నాలుగు సంవత్సరాలు ఉండాలని కోరారు. 7వ దఫా నిర్వహించే ఎన్నికల్లో ముందు వెలువరించే షెడ్యూల్లోనే ఈ కాలపరిమితిని ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి జిమ్మిడి మల్లేష్, నాయకులు కారుకూరి లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాకు మూడు డిగ్రీ గురుకులాలు

కౌటాల(సిర్పూర్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు కొత్తగా మూడు బీసీ డిగ్రీ గురుకులాల ఏర్పాటుకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం మహాత్మాజ్యోతి పూలే గురుకులాల డిగ్రీ కళాశాలలను ఆదిలాబాద్, మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ప్రిన్సిపాల్ కార్యదర్శి బీ వెంకటేశం ప్రకటించారు. దీంతో ఆయా జిల్లాలోని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్‌షాక్‌తో మూడు గేదెలు మృతి

కాసిపేట: మండలంలోని కోమటిచేను శివారులోని పంట చేన్లలో తెగిపడిన విద్యుత్ వైర్లు మూడు గేదెలు మృతి చెందాయి. వివరాల ప్రకారం... గురువారం అర్ధరాత్రి వీచిన గాలివానకు విద్యుత్ వైర్లు తెగిపడిపోవడంతో శుక్రవారం ఆ వైపు వెళ్లిన మూడు గేదెలు మృతిచెందాయి. ఈ విషయంపై విద్యుత్ శాఖ అధికారులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఏఈ స్వర్ణలత తెలిపారు. ఇప్పటి వరకు మృతిచెందిన గేదెలు ఎవరివో తెలియరాలేదు.

మేధావులపై ఉపా చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

బెల్లంపల్లి: రాష్ట్రంలోని మేధావులపై అక్రమంగా పెట్టిన ఉపా చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం బెల్లంపల్లి సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోడు భూములు సాగు చేస్తున్న పేదలందరికీ పట్టాలు ఇవ్వాలన్నారు. దండేపల్లి మండలంలోని కోయ పోచగూడెం ఆదివాసీలను విస్మరించవద్దన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటస్వామి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లకు ఉద్యమించాలి

జన్నారం: బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించడానికి బీఆర్ఎస్ పార్టీ ఉద్యమించాలని బీసీ కులాల పోరాట సమితి కరీంనగర్ జోనల్ కన్వీనర్ కేపే నర్సింహులు, ఉమ్మడి జిల్లా కన్వీనర్ కోడూరి చంద్రయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. సీఎం బీసీ కులాల రిజర్వేషన్ల కోసం పార్లమెంట్‌లో గళం విప్పాలని కోరారు. ఆ సంఘం మండల అధ్యక్షుడు గంగయ్య, జిల్లా కోకన్వీనర్లు లక్ష్మి ఉన్నారు.

షాపును ధ్వంసం చేసిన మహిళలపై కేసు

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మూడో జోన్‌లో పలు కిరాణ షాపుల్లో మద్యం అమ్ముతున్నారని చొరబడి ధ్వంసం చేశారని షాపుల నిర్వాహకుల ఫిర్యాదు మేరకు రామిల్ల రాధిక, బత్తుల సరితతో పాటు మరికొందరు మహిళలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం మధ్యాహ్నం మూడో జోన్‌లోని పలువురి కిరాణ షాపుల్లో మద్యం అమ్ముతున్నారనే అనుమానంతో రాధిక, సరిత మరికొందరు మహిళలతో అక్రమంగా చొరబడి షాపులను ధ్వంసం చేశారు. షాపు నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఇదిలా ఉంటే రాధిక మాట్లాడుతూ అక్రమంగా కాలనీలోని దుకాణాల్లో మద్యం విక్రయిస్తూ ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారనే సమాచారం మేరకు పలు షాపులోని మద్యాన్ని ధ్వంసం చేశామన్నారు.



పోలీస్‌స్టేషన్‌లో మహిళా నాయకులు

కెకె ఓసీలో కొనసాగుతున్న కార్మికుల సమ్మె

కాసిపేట: సమస్యలు పరిష్కరించి కంపెనీ వేరే చోట చెల్లిస్తున్న విధంగా తమకు వేతనాలు చెల్లించాలని కెకె ఓసీ కాంట్రాక్ట్ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం రెండో రోజుకు చేరింది. ఆర్‌వీఆర్ కంపెనీలో విధులు నిర్వహిస్తున్న ఆపరేటర్లు తమకు అన్యాయం చేస్తున్నారని గురువారం సమ్మెకు దిగారు. శుక్రవారం మందమర్రి జీఎం మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కెకె ఓసీ పీవో కార్యాలయంలో చర్చలు జరిపారు. జూలై 1వ తేదీలోగా సంబంధిత కాంట్రాక్టర్‌తో చర్చించి సమస్య పరిష్కారిస్తామని చెప్పడంతో ఇప్పటికే మూడు నెలల వేతనాలు నష్టపోయామని వెంటనే హామీ ఇచ్చి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పోలీసులు, అధికారుల ఒత్తిడి చేసిన కార్మికులు ఒప్పుకోకపోవడంతో సమ్మె యథావిధిగా కొనసాగింది.



కెకె ఓసీలో సమ్మె చేస్తున్న కార్మికులు

పనులు పూర్తి చేసి విద్యుత్ ఉత్పత్తి చేయాలి

చెన్నూర్‌రూరల్: సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి, సోలార్ ప్లాంట్ జనరల్ మేనేజర్ జానకిరామ్‌లు సూచించారు. మండలంలోని శివలింగాపూర్ గ్రామ సమీపంలోని మూతబడ్డ గని ఆవరణలో ఏర్పాటు చేయనున్న సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. చెన్నూర్ 2 ఇంక్‌లైన్ గని ఆవరణలో 11 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వీలైనంత త్వరగా పూర్తి చేసి విద్యుత్ ఉత్పత్తికి కావాల్సిన అన్ని ఏర్పాట్లను చేసుకోవాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. నిర్మాణ పనుల పురోగతిని, గని ఆవరణలో నిర్మించిన కంపౌండ్ వాల్ పనులను పరిశీలించారు. వారి వెంట ఏరియా ఇంజినీర్ జి.రమేష్‌బాబు, ఏరియా వర్క్‌షాప్ డీజీఎం శ్రీనివాస్, సోలార్ ఎస్ఈ అప్పారావు, ఏరియా వర్క్ షాప్ ఈఈ రాకేష్, సోలార్ ఎనర్జీ ఎన్రిచ్ కంపెనీ ప్రతినిధి శ్రీనివాసరావు, మధన్‌మోహన్ రెడ్డి ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న జనరల్ మేనేజర్లు

‘ఎమ్మెల్సీని కఠినంగా శిక్షించాలి’

పాతమంచిర్యాల: ముదిరాజ్‌లను కించపరిచే విధంగా మాట్లాడిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిని కఠినంగా శిక్షించాలని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు తూటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం హుజూరాబాద్‌లో అమరవీరుల స్థూపం వద్ద జరిగిన గొడవలో ముదిరాజ్ కులానికి చెందిన సోషల్ మీడియా రిపోర్టర్‌ను బంధించి చిత్రహింసలకు గురిచేసి కులం పేరుతో బూతులు తిడుతూ ముదిరాజ్ కులస్తులను అవమానకరంగా మాట్లాడాడన్నారు. ముదిరాజ్‌లను అవమానించే విధంగా వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి ముదిరాజ్‌లకు బేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కుల రాజు, నాయకులు కొలిపాక తిరుపతి, కనుకుట్ల శ్రీనివాస్, తిరుపతి, మల్లేష్, నవీన్, సూరయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు తూటి శ్రీనివాస్

పోలీస్‌స్టేషన్‌లో ఆ జేసీబీ ఏమైంది..!

- పోలీస్ వర్గాలను కుదిపేస్తున్న జేసీబీ తరలింపు
- గుప్త నిధుల తవ్వకాల్లో సీజ్.. రిలీజ్ చేయడంపై అనుమానాలు
- పోలీసు ఉన్నతాధికారుల సీరియస్

జైపూర్: జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో జేసీబీ తరలింపు అంశం ఇప్పుడు పోలీస్ వర్గాలను కుదిపేస్తోంది. గుప్త నిధుల తవ్వకాల్లో సీజ్ చేసిన వాహనాన్ని కోర్టు నుంచి ఎలాంటి రిలీజింగ్ అనుమతి లేకుండానే సదరు వ్యక్తికి ఆ జేసీబీసీ అప్పగించడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తున్నాయి. రామగుండం కమిషనరేట్ పరిధిలో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. భీమారం మండలం పోలంపల్లి మామతమ్మ గుడి సమీపంలో 2018లో గుప్త నిధుల తవ్వకాల కేసులో పోలీసులు జేసీబీ, బైక్‌ను సీజ్ చేసి కోర్టుకు అప్పగించారు. కేసు కొనసాగుతుండగా భీమారం పోలీస్‌స్టేషన్‌లో స్థలం లేక రక్షణ నిమిత్తం జేసీబీని జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. గత ఏడాది జైపూర్ పోలీస్‌స్టేషన్‌లోని క్వార్టర్లు, ఎస్సై నివాస గృహం, పాత పోలీస్‌స్టేషన్ భవనాన్ని కూల్చివేశారు. అదే సమయంలో ఇక్కడ ఉన్న జేసీబీని సదరు వ్యక్తికి అప్పగించినట్లుగా తెలుస్తోంది. అయితే ఇటీవల భీమారంకు కొత్తగా వచ్చిన ఎస్సై అన్నీ పరిశీలిస్తుండగా సీజ్ చేసిన జేసీబీపై ఆరా తీశారు. ఆ జేసీబీ అక్కడ లేకపోవడంపై పోలీసులు అధికారులు అవాక్కయ్యారు. ఇంతకాలం ఇక్కడ పని చేసి బదిలీపై వెళ్లిన ఆ సీనియర్ ఎస్సై సీజ్ చేసి కోర్టులో కేసు నడుస్తున్న క్రమంలో ఎలాంటి రిలీజింగ్ ఆర్డర్ లేకుండా జేసీబీని అప్పగించడంపై పెద్ద ఎత్తున్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సీజ్ చేసిన జేసీబీ హర్యాన రాష్ట్రానికి చెందినట్లుగా తెలుస్తోంది. ఈ అంశంపై విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం. కోర్టు కేసులో ఉన్న చిన్నచిన్న వాహనాలనే రిలీజ్ చేయడానికి ఆలోచించే పోలీసులు ఇంత సులువుగా జేసీబీని ఉన్నతాధికారుల కంట చిక్కకుండా స్టేషన్ దాటించడం చర్చనీయాంశంగా మారుతోంది.

తాగునీటి కోసం కార్మికుల నిరసన

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియా వర్క్‌షాప్‌లో వారం రోజులుగా తాగునీరు అందుబాటులో ఉండటం లేదని శుక్రవారం టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. టీబీజీకేఎస్ ఫిట్ కార్యదర్శి కందుల తిరుపతి మాట్లాడుతూ వర్క్‌షాప్‌లో తాగునీటిని అందించాలని వారం రోజులుగా అధికారుల వద్ద మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వర్క్‌షాప్‌లోని మినరల్ వాటర్ ప్లాంటు 15 రోజుల క్రితం చెడిపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించాలని కోరారు. ఏజీఎం తిరుమల్‌రావు, వర్క్‌షాప్ డీజీఎం నాగభూషణం కార్మికులతో మాట్లాడారు. వాటర్ ప్లాంటుకు త్వరలోనే మరమ్మతులు చేపడతామని హామీ ఇవ్వడంతో కార్మికులు ధర్నాను విరమించి విధులకు హాజరయ్యారు. వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మ్మనారాయణ, దాస్, రసూల్, ఏరియా నాయకులు కుమారస్వామి, రాజేశం, వైకుంఠం, విద్యాసాగర్, శ్రీనివాస్, సురేశ్, రాజేశ్, కనకయ్య పాల్గొన్నారు.



వర్క్‌షాప్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

ఇద్దరు పిల్లలతో మహిళ అదృశ్యం

నెన్నెల: మండలంలోని గుండ్లసోమారం గ్రామానికి చెందిన మహిళ తన ఇద్దరు పిల్లలతో అదృశ్యమైనట్లు ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. ఈ నెల 21న రాత్రి ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి పిల్లలను తీసుకుని వెళ్లిపోయింది. కుటుంబీకులు రెండు రోజుల పాటు తెలిసిన వారి ఇళ్లల్లో వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో శుక్రవారం ఆమె భర్త స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

దోమలు వృద్ధి చెందకుండా చర్యలు

మంచిర్యాలటౌన్: జిల్లాలో వర్షాలు కురుస్తున్నందున దోమలు వృద్ధి చెందకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ అనిత అన్నారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమలు పెరిగేందుకు అవకాశం ఉన్న నీటి నిల్వ లేకుండా చూడాలని, దోమలు వృద్ధి చెందే చోట దోమల మందు పిచికారీ వంటి కార్యక్రమాలను స్థానిక సంస్థలతో కలిసి చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ రాజేందర్ ఒక్క దోమకాటుతో ఎన్ని రకాల వ్యాధులు వస్తాయో వివరించి, రాకుండా తీసుకోవాల్సిన చర్యలు తెలియజేశారు.



అవగాహన కల్పిస్తున్న అధికారి డాక్టర్ అనిత

సోలార్ ప్లాంట్ ఏర్పాటుపై సమీక్ష

శ్రీరాంపూర్: చెన్నూర్‌లో మూతపడ్డ 2 ఇంక్లైన్ భూగర్భ గని ఆవరణలో 11 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుపై అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో ఏరియా జీఎం సంజీవరెడ్డి, జీఎం(సోలార్) జానకిరాములు ఏరియా ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కొత్త ప్లాంట్‌ను అక్టోబర్ నెలకల్లా పూర్తి చేసి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించాలని, పనులు వేగవంతం చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లకు జీఎంలు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ రమేష్‌బాబు, వర్క్‌షాప్ డీజీఎం చంద్రశేఖర్‌రెడ్డి, డీజీఎం(సోలార్) శ్రీనివాస్, ఎస్ఈ(సోలార్) అప్పారావు, సోలార్ ఎనర్జీ ఎంక్రిచ్ కంపెనీ ప్రతినిధి శ్రీనివాసరాజు, మదన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.